క్లుప్తంగా

మార్మోగిన గోవింద నామస్మరణ



బలభద్రపురం శ్రీ దేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. శనివారం ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి, అభిషేకార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. జిల్లా నలుమూల నుంచి వచ్చిన భక్తులు సుమారు 8వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు 4వేల మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు నల్లమిల్లి రామచంద్రారెడ్డి(రాము) తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: సంపరలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వేకువ జామున పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి తులసీ దళాలతో, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేషాలంకరణ చేశారు.

లారీ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలు



జాతీయ రహదారిపై జీఎస్ఎల్ ఆస్పత్రి ఎదురుగా బోల్తా పడిన లారీ

రాజానగరం: జాతీయ రహదారిపై జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రి సమీపంలో శనివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం మండలంలోని తూర్పుగానుగూడెంకు చెందిన నూకతట్టి సుబ్బారావు జీఎస్ఎల్ ఆస్పత్రికి పక్కనే ఉన్న హోటల్‌లో పనిచేస్తున్నాడు. డ్యూటీ ముగిసిన తరువాత నడుచుకుంటూ వెళ్తున్న అతనిని రాజమహేంద్రవరం నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ వాహన వేగాన్ని నియంత్రించే క్రమంలో లారీ రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ఘటనలో సుబ్బారావు తలకు బలంగా తగలడంతో అతడిని జీఎస్ఎల్ ఆస్పత్రిలో చేర్పించారు. క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. దీనిపై రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తయారీ యూనిట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



కాపవరంలో స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ

బిక్కవోలు: కాపవరంలోని ఏపీఐఐసీ ద్వారా చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే యూనిట్లు ఏర్పాటు చేయడానికి స్థలాన్ని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ శనివారం పరిశీలించారు. ఈ స్థలం 11.98 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇప్పటికే పలువురు అధికారులు ఈ స్థలాన్ని పరిశీలించి నివేదిక అందిచడంతో మంత్రి పరిశీలించారు. మంత్రికి తహసీల్దార్ బి.సత్యవీరవెంకటకృష్ణ స్థలాన్ని చూపించారు. ఇక్కడ యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను రాజమహేంద్రవరం మున్సిపాలిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవి మంత్రికి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడి మృతి అత్యంత బాధాకరం

సీతానగరం: సీనియర్ పాత్రికేయుడు గొల్లకోటి శివప్రసాద్ మృతి అత్యంత బాధాకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విలేకరి శివప్రసాద్ కొన్ని రోజులుగా రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందారు. దీనిపై జక్కంపూడి రాజా స్పందించి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని జక్కంపూడి రాజా తెలిపారు.

కందిపప్పు పంపిణీ లేనట్టేనా!

- అరకొరగా రేషన్ సరకుల సరఫరా
- చాలా గ్రామాల్లో బియ్యం మాత్రమే సరఫరా
- ఫిబ్రవరి, మార్చి నెలల్లో కందిపప్పు పంపిణీ చేయని వైనం
- కూటమి ప్రభుత్వం తీరుపై రేషన్‌కార్డుదారుల ఆగ్రహం



పందలపాకలో ఎండీయూ వాహనం వద్ద రేషన్ తీసుకుంటున్న గ్రామస్తులు

బిక్కవోలు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. కందిపప్పు ధరలు బాగా పెరిగాయి. పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసే కందిపప్పును వినియోగించుకుందామని రేషన్‌కార్డుదారులు ఆలోచిస్తుంటే కూటమి ప్రభుత్వం వారి ఆశలపై నీళ్ల చల్లింది. జనవరిలో కొద్దిమందికి మాత్రంగా కందిపప్పు పంపిణీ చేశారు. ఫిబ్రవరిలో బియ్యం, పంచదారే పంపిణీ చేశారు. మార్చిలో అయినా కందిపప్పు ఇస్తారని కార్డుదారులు ఎదురుచూశారు. ఈ నెలలో కూడా కందిపప్పు సరఫరా చేయపోవడంతో కార్డుదారులు మండిపడుతున్నారు. బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.180 పలుకుతోంది. ఎండీయూ వాహనాల ద్వారా కిలో రూ.67 కందిపప్పు లభిస్తుండటంతో కొంతవరకు కార్డుదారులు సంతోషించారు. కేవలం కొన్ని నెలలు మాత్రమే ఎండీయూ వాహనాల ద్వారా కందిపప్పు పంపిణీ చేసి అనంతరం చేతులెత్తేయడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బియ్యంతో సరి

ప్రతి నెల రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. కూటమి నాయకులు ఎన్నికల్లో రేషన్ డిపో ద్వారా అన్ని రకాల పప్పులు రాయితీ ధరలకు పంపిణీ చేస్తామని, సంకాంత్రి కానుకలు అందిస్తామని హామీ ఇచ్చారు. కానుక మాట అలా ఉంచితే ప్రతి నెల ఇచ్చే సరుకులు సక్రమంగా ఇవ్వడంలేదు. అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి తనిఖీల సందర్భంగా తూకంలో తేడా ఉందన్న నెపంతో పంచదార, కందిపప్పు నిల్వలను చాలా డిపోల నుంచి వెనక్కు పంపేశారు. అంతవరకు బాగానే ఉంది. వరుసగా రెండు నెలల పాటు రేషన్ వాహనాల ద్వారా బియ్యం, చక్కెర తప్ప మిగిలిన సరుకులు ఇవ్వడం లేవు. ఈ నెలలో బియ్యం తప్ప పంచదార, కందిపప్పు ఇవ్వలేదని చాలా గ్రామాల్లో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా కందిపప్పు రాకపోవడంతో కార్డుదారులు డీలర్లను నిలదీస్తున్నారు. అనపర్తి నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో పంచదార, కొన్ని చోట్ల కందిపప్పు పంపిణీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. కందిపప్పు. చక్కెర స్టాకు ఇంకా రావల్సి ఉందని వారన్నారు. స్టాకు వచ్చిన తరువాత మిగిలిన వారికి సరుకులు అందిస్తామని ఎంఎస్‌వో అధికారులు అంటున్నారు.

నియోజకవర్గంలో

మండలం	రేషన్ కార్డులు
అనపర్తి	23,175
బిక్కవోలు	23,148
రంగంపేట	20,323
పెదపూడి	23,932
మొత్తం	90,576

పేదలపై చిన్నచూపు



కూటమి ప్రభుత్వం ఆధికారం చేపట్టాక ఒక్క హామీని కూడా సక్రమంగా నెరవేర్చలేదు. కనీసం కందిపప్పు కూడా కార్డుదారులకు ఇవ్వడంలేదు. జనవరిలో అక్కడక్కడ ఇచ్చారు. ఫిబ్రవరి, మార్చిలో మొండి చేయి చూపారు. వచ్చే నెలలో అయినా కందిపప్పు సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గండికోట వీరవేణి, రంగాపురం

వచ్చిన వాటిని సరఫరా చేస్తున్నాం

మండలంలోని రెండు ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. వచ్చిన నిత్యావసర సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు అందిస్తున్నాం. వేలంగి పాయింట్ ద్వారా 80 శాతం, కాకినాడ పాయింట్ ద్వారా 40 శాతం పంచదార, కందిపప్పు సరఫరా చేశాం. సరుకు వచ్చిన వెంటనే అందరికీ కందిపప్పు, పంచదార అందించేందుకు కృషి చేస్తాం.

– కమల, ఎంఎస్‌వో, పెదపూడి

లక్ష్మీశ్రావ్యకు ప్రశంసాపత్రం



కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న లక్ష్మీశ్రావ్య తదితరులు

రంగంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కె. లక్ష్మీ శ్రావ్య ఉత్తమ క్రీడా ప్రశంసాపత్రం అందుకుంది.జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో లక్ష్మీ శ్రావ్య పాల్గొని రాణించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం రాజమహేంద్రవరం వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన సభలో కలెక్టర్ పి. ప్రశాంతి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా లక్ష్మీశ్రావ్య ప్రశంసాపత్రం అందుకుంది. ఈ సందర్భంగా పీడీ శైలను, విద్యార్థిని లక్ష్మీశ్రావ్యను ప్రధానోపాధ్యాయుడు వి. పార్థసారధి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంటర్ పరీక్షలకు 23 మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం గణితం 1బి, జువాలజీ పేపర్ 1, హిస్టరీ పేపర్ 1 పరీక్షలు నిర్వహించినట్టు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు బి. హేమ, ఎస్.మాధురి తెలిపారు. రంగంపేట, రాజానగరం మండలాలకు చెందిన విద్యార్థులు, గణితం, జువాలజీ, చరిత్ర పరీక్షలకు ఏ, బీ సెంటర్లలో మొత్తం 567 మంది హాజరు కావాల్సి ఉండగా ఏ సెంటర్‌లో 16, బీ సెంటర్‌లో ఏడుగురు పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు. డిపార్టుమెంటల్ అధికారులుగా ఏపీఆర్‌వీ ప్రసాద్, ఎంవీఎస్ కృష్ణ వ్యవహరించారు.

కొనసాగుతున్న ఉపవాస ప్రార్థనలు



బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

మధురపూడి: క్రైస్తవుల శ్రమలకాలం ప్రార్థనలు 4 రోజులుగా విజయవంతంగా కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవుల ఆరాధ్యదైవం ఏసుక్రీస్తు అనుభవించిన శ్రమలకు గుర్తుగా శ్రమలకాలాన్ని నిర్వహిస్తారు. ఈ నెల 5న ప్రారంభమైన శ్రమల కాలం ప్రార్థనలు 40 రోజులపాటు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 18 వరకు ఈ ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 18న గుడ్‌ఫ్రైడే, ఏప్రిల్ 19న రాత్రి క్రీస్తు పునరుత్థానుడవుతాడన్న నమ్మకంతో రాత్రంతా జాగరణ ప్రార్థనలు నిర్వహిస్తామని పాస్టర్లు తెలిపారు. ఏప్రిల్ 20న ఈస్టర్ పండుగ నిర్వహిస్తారు. ఈ శ్రమలకాలం ఈస్టర్ వరకూ ఉపవాస ప్రార్థనలతో కొనసాగుతుందన్నారు. ఆర్‌సీఎం క్రైస్తవులు ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో ప్రార్థనలు నిర్వహిస్తామని తెలిపారు.

మాలధారణతో ప్రార్థనలు

తపస్సు కాలం సందర్భంగా కొందరు క్రైస్తవులు మాలధారణ చేస్తారు. తెల్లటి దుస్తులతో, మెడలో జపమాలను ధరించి, 40 రోజుల పాటు నియమనిష్టలతో ఉపవాసాలు చేస్తారు. ఆర్‌సీఎం సంఘంలో రెవరెండ్ ఫాదర్స్ ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతుంది. ఈ నెల 5 నుంచి ప్రారంభమైన తప స్సుకాలంలో జిల్లాలో 300 మంది మాల ధారణ చేశారు. వీరంతా నిష్ఠతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రార్థనలు చేస్తారు. గుడ్‌ఫ్రైడే వరకూ మాలధారణతో ఉంటారు. తరువాత రోజున మాల విడుస్తారు. మాలధారణ చేసినవారంతా సోదరీ, సోదరా అనే సంబోధిస్తారు. మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గం 3 మండలాల్లో లూథరన్, ఆర్‌సీఎం, బాప్టిస్ట్, బైబిల్ మిషన్లకు చెందిన 150 చర్చిలున్నాయి. ఇక్కడ క్రైస్తవులు ప్రతిరోజూ తెల్లవారు జాము, రాత్రి వేళల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్‌కు మహిళా ధాత్రి అవార్డు



లక్ష్మీ లాలిత్యకు మహిళా ధాత్రి అవార్డును అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థిని కె.లక్ష్మీలాలిత్యకు మహిళా ధాత్రి అవార్డు లభించింది. కడప జిల్లా ఓబులాపురంలో వివేకానంద సేవ ఆశ్రమం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో లక్ష్మీ లాలిత్యను సత్కరించి అవార్డును ప్రదానం చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి ధనరాజ్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా బాలికల సంక్షేమం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలతో పాటు రెండు పర్యాయాలు జాతీయ యూత్ పార్లమెంటులో ఏపీ తరపున ప్రాతినిధ్యం వహించినందుకు గుర్తింపుగా ఆమెను సత్కరించి, అవార్డును అందజేశారన్నారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

మధురపూడి: ప్రాచీనమైన చరిత్ర కలిగిన కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 9వతేదీ ఆదివారం నుంచి ప్రారంభమవుతాయి. దత్తత దేవ స్థానమైన అన్నవరం శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 10న మధ్యాహ్నం 1.46 గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుంది. రాత్రి 9 గంటలకు వైఖానస ఆగమ, శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. ఆదివారం స్థానిక దేవుని కోనేరు వద్ద నుంచి పుట్టమన్ను సేకరిస్తారు. అంకురార్పణం, ధ్వజారోహణం అనంతరం తీర్థం ప్రారంభమవుతుంది. స్వామివారి కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం స్వామివారి దేవస్థానంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.దేవస్థానం. ధర్మకర్త రంగరాజ బట్టర్, అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ వాసు, సిబ్బంది, కోరుకొండ ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, తహసీల్దార్ సుస్వాగతం, నార్త్‌జోన్ డీఎస్పీ వై. శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్ పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దంటూ గ్రామస్తుల ఆందోళన



మద్యం షాపు ఎదురుగా నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సీతానగరం: జనావాసాల మధ్య మద్యం షాపు వద్దంటూ శనివారం మహిళలు ఆందోళనకు దిగారు. సీతానగరం ఎస్‌బీఐ దగ్గరలో బీసీలకు మంజూరైన మద్యం షాపు ఏర్పాటుకు నిర్వాహకులు సమాయత్తమయ్యారు. జనావాసాల మద్యం షాపు వద్దంటూ పలువురు స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం అధిక సంఖ్యలో మహిళలు వచ్చి టెంట్ వేసి రోడ్డుపై నిరసన తెలిపారు. సీతానగరంలో ఇప్పటికే రెండు మద్యం షాపులున్నాయని, బీసీలకు మంజూరైన షాపును మిర్తిపాడు, ఉండేశ్వరపురం వంటి దూర గ్రామాల్లో ఏర్పాటు చేసుకోవాలని వారు సూచించారు. మహిళలు కొల్లి శివ దర్శిని, వనపల్లి అన్నపూర్ణ, రావూరి లక్ష్మీభవాని, ఎడ్లపల్లి శ్రీదేవి, కాంద్రు అనంతలక్ష్మి, వానపల్లి విజయలక్ష్మి, నామ భవాని, గొలుగూరి సుజాత, ఎలమాటి శ్రీలక్ష్మి, రాజు రామసీత, కోడె బత్తుల ఉమాదేవి తదితరులు ఆందోళన చేపట్టారు. మద్యం సేవించిన వారితో భయాందోళనకు గురవుతామని వారన్నారు. ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేస్తే అడ్డుకోవడంతోపాటు ఆందోళనకు ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

రాజానగరం: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సేంద్రియ ఎరువులతో సేద్యం చేస్తే జీవన సరళిలో కూడా మంచి మార్పులను గమనించవచ్చని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే కషాయాలు, విత్తన గుళికల తయారీపై ఈ కేంద్రంలో శనివారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగు మందులను వాడటం వల్ల మానవ ఆరోగ్యానికి, పర్యావరణకు కలిగే నష్టాలను వివరించారు. నేటి సమాజంలో ఈ విషయంపై అవగాహన పెరగడంతో ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. కషాయాల తయారీపై జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం (ఏపీసీఎన్ఎఫ్) సభ్యుడు వెంకట్రావు అవగాహన కల్పించారు. విత్తన గుళికల తయారీ, ఆవశ్యకతను మరో సభ్యుడు గోపి వివరించారు. కలవచర్ల, రాజానగరం, సీతారామపురం, నరేంద్రపురం, నాగులపల్లి, యు.కొత్తపల్లి, కోటి కేశవరాలకు చెందిన 50 మంది రైతులు శిక్షణకు హాజరయ్యారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

- మహిళల సాధికారత ఆకాంక్షించిన వ్యక్తి మాజీ సీఎం జగన్
- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



అనపర్తి పార్టీ కార్యాలయంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

పెదపూడి: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు ఇమ్మంది విజయ కుమారి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు కేక్‌ను కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు తొలుత మహిళా సాధికారితను ఆకాంక్షించిన మాజీ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలుగా పదవీ విరమణ చేసిన గొలుగూరి విజయలక్ష్మి, రాపాక లెల్లిమార్గరేట్, పలివెల విజయకుమారి, బిక్కవోలు మండలానికి చెందిన వి.వెంకటలక్ష్మి సహా వివిధ రంగాలను చెందిన 150 మంది మహిళలను సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ పార్టీ కార్యాలయంలో ఈ వేడుకలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. రిజర్వేషన్లతో సంబంధం లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు మహిళలకు కేటాయించి వారి అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రంలో మహిళలకు మరిన్ని మంచి రోజులు రావాలంటే మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడాలని అన్నారు. ఈ వేడుకల్లో సర్పంచులు వారా కుమారి, కుడిపూడి మాధవిలత, డొకుబుర్ర మీనాక్షి, గుత్తుల పుష్పవాతి, వేణు, ఎంపీటీసీ సభ్యులు ఎం.పాపా, కర్రి గీతా సావిత్రి, గుత్తుల పాపా, గుత్తుల మహాలక్ష్మి, తుమ్మా రాజేశ్వరి, పడాల చంద్రకళ, తేతలి కళావతి, బొడ్డు సునీత, మహిహిళా ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలి

పెదపూడి: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు రాగుల తిరుపతమ్మ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు జె.వెంకటేశ్వర్లు అన్నారు. జి.మామిడాడలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ), సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా పోరాట దినం సందర్భంగా సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు రాగుల రఘువులు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గుబ్బల ఆదినారాయణ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సత్కారం

బిక్కవోలు: బలభద్రపురంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ, సచివాలయంలో పనిచేస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచి బుంగా రామారావు మాట్లాడుతూ ప్రతిరోజూ మహిళలను గౌరవించాలన్నారు. అనంతరం మహిళా రక్షణ కార్యదర్శి కొటాని శాంతి పాటు పలువురు మహిళలను సత్కరించారు.ఈ కార్యక్రమంలోని పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి పాల్గొన్నారు.



బలభద్రపురం మహిళా సంక్షేమ కార్యదర్శి కొటాని శాంతిని సత్కరిస్తున్న సర్పంచి రామారావు



ఒకరికొకరు సాయపడుతూ సమష్టిగా పయనిస్తామంటూ విక్టర్ సింబల్‌ని చూపుతున్న న్యూ సిటీ మహిళలు



మహిళా ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న దృశ్యం

వైద్యులకు ఘన సత్కారం



సీతానగరం పీహెచ్‌సీలో డాక్టర్ యేసురాణి, సిబ్బందిని సన్మానించిన రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం సీతానగరం పీహెచ్‌సీలో వైద్యులు డాక్టర్ యేసురాణి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మహిళా దినోత్సవం జరుపుకున్నారు. పీహెచ్‌సీ వైద్యులు ఏవీకె చైతన్య, డాక్టర్ యేసురాణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమలో ఎమ్‌పీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్లు కె సుధాకర్, దైవకృప, సిబ్బంది శిల్ప, చందు, రత్నకుమారి, ఎస్కే మున్నీషా పాల్గొన్నారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభచూపిన మట్టా జాబిల్లి, మానేపల్లి స్ఫూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం సుధామయి రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పి ప్రశాంతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందుకున్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సీతానగరం శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ సత్యం రమేష్ బాబు, పెదపాటి డాక్టర్‌బాబు, ఎస్ సుధాకర్, ఎస్ సురేష్‌బాబు, పి శివ, గంగరాజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ యేసురాణి, పీహెచ్‌సీ సిబ్బంది దైవకృప, స్వరూపారాణిని సత్కరించారు. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా కార్యదర్శి, రెడ్‌క్రాస్ సొసైటీ మండల చైర్మన్, మదర్ థెరిస్సా సేవా సమితి వ్యవస్థాపకుడు పెదపాటి డాక్టర్ బాబు మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి, పలువురు మహిళలను సన్మానించి, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమలో పార్టీ నాయకుడు ద్వారంపూడి రామకృష్ణ, వలవల వలీ, అధికారి శ్రీను పాల్గొన్నారు. పురుషోత్తపట్నంలో సాధన మహిళా మండల కార్యాలయంలో అధ్యక్షురాలు పసలపూడి సుజ్ఞాన కుమారి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

సమైక్యతతోనే మహిళాభ్యుదయం

రాజానగరం: సమాజంలో ప్రతి మహిళ తోటి మహిళలను గౌరవిస్తూ, సమైక్యతతో మెలిగిన నాడే మహిళాభ్యుదయం సాకారమవుతుందని రాజానగరం న్యూ సిటీలోని మహిళలు అన్నారు. ఇందుకు తామంతా ఒకరికొకరు సాయపడుతూ సమష్టిగా పయనిస్తామంటూ విక్టర్ సింబల్‌ని చూపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని న్యూ సిటీ కాలనీవాసులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, పంచుతూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

రాజానగరం: నియోజకవర్గంలో ప్రతి మహిళ స్వయం ఉపాధితో ఆర్థిక పురోభివృద్ధిని సాధించే దిశగా పయనించాలని స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. స్థానిక రాయల్ ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలో బత్తుల బలరామకృష్ణ సతీసమేతంగా పాల్గొని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళా ప్రజాప్రతినిధులను, అధికారులను, సమాజ సేవకులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

మహిళా ఉద్యోగులకు సత్కారం

రాజానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని కలవచర్ల గ్రామ సచివాలయం, ఇతర ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహిళలను దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందించారు.